క్లుప్తంగా

నాగమానసాదేవికి ప్రత్యేక పూజలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆషాఢ మాసం పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డి నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో గురువారం ప్రత్యేక పూజల నిర్వహించారు. భక్తులు నాగమానసాదేవి అమ్మవారికి చీరలు, గాజులు సమర్పించారు. మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళా భక్తులు సమర్పించిన గాజులు అమ్మవారికి అలంకరించారు. పసుపు, కుంకుమతో పండ్లు, పూలు సమర్పించి అమ్మవారిని కొలిచారు. సుధాస్వామి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

17న దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో తొలి ఏకాదశి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈనెల 17వ తేదీ బుధవారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు అలంకరణ సేవ జరుగుతాయన్నారు. సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి 11 సార్లు విష్ణు సహస్ర నామ పారాయణం, తులసి అర్చన నిర్వహిస్తామన్నారు. భక్తులు తొలి ఏకాదశి పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని ఆయన కోరారు.

టైలర్స్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టైలర్స్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరావుకు ఏపీ టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ సహకార సంఘాల సమాఖ్య ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. సమాఖ్య ప్రతినిధులు ఎమ్మెల్యే బొండా ఉమాను గురువారం కలిశారు. టైలర్స్ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా యాక్స్ టైలర్స్ అధినేత, ఎన్టీఆర్ కాస్ట్యూమ్ డిజైనర్ యర్రంశెట్టి వాలేశ్వరరావు ఎమ్మెల్యేను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్యాణ్, నాయకులు కొండల రాజు, కనకదుర్గ, కొండ తదితరులు ఉన్నారు.

వీఎంసీ నైట్ షెల్టర్ల నిర్వహణకు దరఖాస్తు చేసుకోండి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు, ఫుట్‌పాత్‌లలో నిద్రించే వారికి ఆశ్రయం కల్పించే క్రమంలో నైట్ షెల్టర్ హౌస్‌ను నిర్వహణకు దరఖాస్తులు కోరుతున్నట్లు వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రిజిస్టరైన స్థానిక ఎన్జీవోలు, ఎస్‌వోలు నిరాశ్రయ సమష్టి సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, స్వయం సహాయక సమాఖ్యలు, ఉమెన్ అండ్ యూత్ కమ్యూనిటీ బేస్ట్ గ్రూపులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌లు, ప్రైవేటు సెక్టార్ కంపెనీలు, అసోసియేషన్‌లు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హనుమాన్‌పేట, సితార సెంటర్, రాణిగారితోట సిమెంట్ గోడౌన్ వద్ద షెల్టర్లు నిర్దేశించిన నిబంధనల ప్రకారం షెల్టర్‌లు నిర్వహించేందుకు పూర్తి అనుభవమున్న సంస్థలు ఈ నెల 23వ తేదీలోపు పట్టణ సామాజికాభివృద్ధి విభాగం అధికారిని సంప్రదించి దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు.

లయోలాలో ఘనంగా మ్యాగ్నలైట్ 2కే24

గుణదల(విజయవాడతూర్పు): ఆంధ్రా లయోలా కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో 'మ్యాగ్నలైట్ 2కే24' రెండు రోజుల జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోటల్ హయత్ ప్లేస్ మేనేజింగ్ డైరెక్టర్ సాయి కార్తీక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయి కార్తీక్ మాట్లాడుతూ.. కష్టపడే మనస్తత్వం ఉంటే ఎంతటి విజయమైన సాధించగలమన్నారు. తాను మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చి సాధించిన విజయం గురించి విద్యార్థులకు వివరించారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థలో ఉద్యోగం నుంచి దేశంలో తన సొంత వ్యవస్థాపక సంస్థ వరకు తన ప్రయాణాన్ని క్లుప్తంగా తెలిపారు. తాము అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి ఎన్ని సవాళ్లు ఎదురైన వెనకడుగు వేయకూడదన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఫాదర్ ఎం.సగయ రాజ్, పీజీ డిపార్టుమెంట్ వైస్ ప్రిన్సిపాల్ కె.ఎం.ప్రభుదాస్, ఎంబీఏ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ మాధురి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లికి వందనం కోసం ఎదురుచూపులు

- ప్రతి తల్లికీ రూ.15 వేలు తల్లికి వందనం పథకం వర్తింపు
- జీవో 29లో మార్గదర్శకాలను విడుదల చేసిన ప్రభుత్వం
- ఎన్నికల హామీని తుంగలో తొక్కుతున్న బాబు సర్కార్
- పశ్చిమంలో 40 వేల మంది విద్యార్థులు



కూటమి మ్యానిఫెస్టోలో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామన్న తల్లికి వందనం హామీ(సర్కిల్‌లో)

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం పగ్గాలు చేపట్టగానే హామీలకు తూట్లు పొడుస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల్లో కీలకమైన తల్లికి వందనం పథకాన్ని వాగ్దానానికి భిన్నంగా చంద్రబాబు జీవో విడుదల చేశారు. గత ప్రభుత్వం పాఠశాలకు తమ పిల్లలను పంపించే ప్రతి తల్లికి ప్రొత్సాహం కింద రూ.15 వేలు వారి బ్యాంకు ఖాతాలో వేసేది. అయితే తల్లికి కాదు ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేల చొప్పున బ్యాంకు ఖాతాలో వేస్తామని చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు తన ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. ఆ దిశగా మహిళలు చంద్రబాబు కూటమికి ఓట్లు వేశారు. అయితే రెండు రోజుల క్రితం తల్లికి వందనం పథకానికి సంబంధించి మార్గదర్శకాలను వివరిస్తూ ప్రభుత్వం జీవో నంబర్ 29ని జారీ చేసింది. అందులో ప్రతి తల్లికి రూ.15 వేలు అంటూ పేర్కొనటంతో ప్రజల్లో అయోమయం నెలకొంది.

నియోజకవర్గంలో 150 విద్యాసంస్థలు

పశ్చిమ నియోజకవర్గంలో సుమారు 150 విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. అందులో ప్రైవేట్, ప్రభుత్వ యజమాన్యాలకు సంబంధించి ఉన్నాయి. 150 విద్యాసంస్థల్లో సుమారుగా 40 వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. 150 విద్యాసంస్థల్లో సుమారుగా 40 వరకూ ప్రభుత్వ, ఎయిడెడ్, మున్సిపల్ యజమాన్యాల పరిధిలోని విద్యాసంస్థలు కొనసాగుతుండగా మిగిలనవన్ని ప్రైవేట్ యజమాన్యంలోనే ఉన్నాయి. 40 వేల మంది విద్యార్థులకు సంబంధించి 70 నుంచి 80 శాతం వరకూ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన వారేనని అధికారులు చెబుతున్నారు. అంటే 80 శాతం విద్యార్థులకు తల్లికి వందనం పథకానికి సంబంధించి వారివారి తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు వేయాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఆ వాగ్దానంపై గందరగోళం నెలకొని ఉంది.

అయోమయంలో విద్యార్థుల తల్లులు

తెలుగుదేశం పార్టీ కూటమి ఇచ్చిన వాగ్దానాలకు మహిళలు ఆశ పడ్డారు. ఎంతో ఆశతో ఆయా పథకాలను అధికారంలోకి రాగానే తమకు ఇద్దరు పిల్లలు ఉంటే రూ.15 వేలు చొప్పున ఇద్దరికీ కలిపి రూ.30 వేలు బ్యాంకు ఖాతాలో పడుతుందని ఎదురు చూస్తున్నారు. తాజాగా ప్రభుత్వం జారీ చేసిన జీవోలో ఒక్కొక్క తల్లికి రూ.15 వేలు అంటూ పేర్కొనటంతో మహిళల్లో అయోమయం నెలకొని ఉంది. తల్లికి వందనం పేరుతో ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా చెబుతున్న ఈ పథకం తమను మోసం చేసే దిశగా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మిగిలిన పథకాల విషయంలోనూ రానున్న కాలంలో మహిళల నుంచి మరింత ఆగ్రహం వ్యక్తం కాకతప్పదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

అందరికీ నగదు ఇవ్వాలి..



ప్రజలకు హామీ ఇచ్చే ముందు ఆలోచించుకోవాలి. ఏదైనా చేయగలిగితేనే మేనిఫెస్టోలో పెట్టాలి. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటుంటే అంత మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామని చెప్పారు. ఇప్పుడు ఒక తల్లి ఖాతాలో ఒక విద్యార్థికి మాత్రమే ఇస్తామనడం సరికాదు. కాగా స్కూల్ తెరిచి నెల రోజులు దాటినా ఇంత వరకు ప్రభుత్వం ఖాతాల్లో జమ చేయలేదు. ప్రైవేట్ స్కూల్‌లో ఇద్దరు పిల్లలు చదువుతున్నారు. ఆ స్కూల్ యాజమాన్యం ఫీజులు చెల్లించమని ఒత్తిడి తెస్తుంది. ఇద్దరు పిల్లలకు నగదు ఇవ్వాలి

– ఎస్.దీపిక, విద్యాధరపురం

ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలను నివారించండి



మాట్లాడుతున్న ఏడీసీపీ ప్రసాద్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యువతరం ట్రాఫిక్ రూల్స్‌ను పాటించి, ప్రమాదాలను నివారించాలని విజయవాడ పోలీస్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ(ట్రాఫిక్) డి.ప్రసాద్ తెలిపారు. విజయవాడ సిటీ పోలీసు, కాకరపర్తి భావనారాయణ కళాశాల, మండల న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ డీసీపీ ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో యువత అత్యధికంగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతుందన్నారు. యువత ట్రాఫిక్ రూల్స్‌ను పక్కనపెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరించటం వలన తమ విలువైన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని చెప్పారు. రోడ్డు ప్రమాదాల్లో 15 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన యువకులే అత్యధికంగా ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. దానివలన ఆ కుటుంబంలోని తల్లిదండ్రుల మనోవ్యధను ఎవరూ తీర్చలేరన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలన్నారు. తప్పనిసరిగా నాణ్యత కలిగిన హెల్మెంట్‌ను వినియోగించాలన్నారు. హెల్మెట్ వాడకపోవటం వలన సగానిపైగా మరణాలు సంభవిస్తున్నాయని గుర్తు చేశారు.

చట్టాలు మరింత కట్టుదిట్టం..

మండల లీగల్ సర్వీసెస్ కమిటీ లీగల్ సర్వీసెస్ ఆఫీసర్ పి.రాము మాట్లాడుతూ.. మోటారు వెహికల్‌కు సంబంధించి నూతన చట్టాలను మరింత కట్టుదిట్టం చేశారన్నారు. నిబంధనలను ఉల్లంఘించి చట్టాలను అతిక్రమిస్తే భారీ జరిమానాలను విధిస్తామన్నారు. ఏసీపీ వెస్ట్(ట్రాఫిక్) బి.జనార్దనరావు మాట్లాడుతూ విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను పాటించటం ద్వారా సమాజానికి మేలు చేసినవారవుతారన్నారు. నిబంధనలను పాటించి ప్రమాదాలను నివారించాలని సూచించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అధ్యక్షత వహించారు. ట్రాఫిక్ సీఐలు బి.వెంకటేశ్వరరావు, ఆర్.సూర్యభాస్కర్‌లు మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ పీవోలు ఎస్.సాంబశివరావు, డి.పవన్‌కుమార్, కల్మాబేగం, ఎన్‌సీసీ ఆఫీసర్ టి.విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నూర్‌బాషా ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా కాశింబీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ నూర్ బాషా ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షేక్ పెద్ద కాశింబీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మైలవరం నియోజకవర్గానికి చెందిన తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించినందుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్ బాజీకి కృతజ్ఞతలు తెలిపారు. నూర్ బాషా సామాజికవర్గానికి చెందిన ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి నూర్ బాషా సామాజిక వర్గానికి చెందిన మహిళల సమస్యలను తెలుసుకుని అధ్యక్షుడి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జ్ డి.హుస్సేన్ ఆమెను అభినందించారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలి



అవగాహన ర్యాలీలో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జలదూత్ క్యాంపెయిన్–2024 కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీను ప్రాంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రపంచంలో నీరు అత్యంత విలువైనదని, దానిని కాపాడుకోవాల్సిన భాద్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే నీటి ప్రాధాన్యతను గుర్తించాలని సూచించారు. నీటి వృధాను అరికట్టటంతో పాటు వర్షపునీటిని వినియోగించుకునేలా చర్యలుతీసుకోవాలన్నారు. అనంతరం వర్షపునీటిని కాపాడుకోవాలని నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ కొనసాగింది. అధ్యాపకులు కేవీఎస్ ప్రసాద్, సురేష్, మల్యాద్రి, బీబీ, లక్ష్మీజానకి, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతల కవ్వింపు చర్యలు



భవానీపురం శివాలయం సెంటర్‌లో వైఎస్సార్ సీపీ పోల్‌కు టీడీపీ జెండా



విద్యాధరపురం చెరువు సెంటర్‌లో వైఎస్సార్ సీపీ పోల్‌కి జనసేన ఫ్లెక్సీ

పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నేతలు కవ్వింపు చర్యలు కొనసాగిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోల్స్‌కు వారి పార్టీల ఫ్లెక్సీలు, జెండాలు కట్టి వివాదాలకు తెరలేపుతున్నారు. గత నెల రోజులుగా వైఎస్సార్ విగ్రహాల ధ్వంసం, పార్టీ ఆఫీస్‌లు, కార్యకర్తలపై దాడులు కొనసాగిస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకుల విధ్వంసకర చర్యలను ఆయా పార్టీల అధిష్టానాలు అరికట్టాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

– భవానీపురం(విజయవాడపశ్చిమ)

న్యాయవాదిపై దాడి.. కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): న్యాయవాదిపై దాడికి పాల్పడిన వారిపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈద్గా మహల్ సమీపంలో పుప్పాల శ్రీనివాసరావు కుటుంబం నివాసం ఉంటోంది. శ్రీనివాసరావు న్యాయవాదిగా జీవనం సాగిస్తున్నారు. శ్రీనివాసరావు తల్లి కొత్త అమ్మవారి గుడి ఎదురుగా ఉన్న విమలా బేకరీ వీధిలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 7న శ్రీనివాసరావు తల్లికి అనారోగ్యంగా ఉండటంతో వెళ్లి పరామర్శించి మందులు తెచ్చేందుకు మెయిన్ రోడ్డుపైకి వచ్చాడు. ఈ క్రమంలో రోడ్డుపై పునుగుల బండి వ్యాపారం చేసే వాంద్రాసి మధులత శ్రీనివాసరావును ఆపి ఎవరనీ ప్రశ్నించింది. వారి మధ్య మాటా మాటా పెరిగింది. ఈ క్రమంలో నోటికి వచ్చినట్లు ఏకవచనంతో దూషించడమే కాకుండా ఆమె భర్త మోహన్ శ్రీనివాసరావుపై దాడికి పాల్పడ్డాడు. దీంతో న్యాయవాది పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వైద్య శిబిరంలో నేత్ర పరీక్షలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నేత్రాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అయాన్ ఐ హాస్పిటల్ అధినేత డాక్టర్ బషీర్ అహ్మద్ అన్నారు. అయాన్ హాస్పిటల్స్, ఫ్యామిలీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్(వస్త్రలత) ప్రాంగణంలో గురువారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ బషీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. శరీరానికి వ్యాయమం చాలా అవసరమని చెప్పారు. ప్రతి రోజూ కొద్ది సేపు వ్యాయమానికి కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. జీవన విధానంలో సరైన మార్పులు తీసుకుంటే చక్కని ఆరోగ్యాన్ని సొంతం చేసుకోగలరని చెప్పారు. డాక్టర్ సైరాబాను మాట్లాడుతూ మహిళలు రోజువారీ జీవితంలో ఆహారం, శారీరక శ్రమ తదితర అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకున్నవారవుతారని చెప్పారు. కార్యక్రమంలో హాస్పిటల్స్ గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంతశర్మ, వస్త్రలత అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌మోహనరావు, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన

కృష్ణలంక(విజయవాతూర్పు): మాదక ద్రవ్యాలు సేవించడం వలన కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని కృష్ణలంక పోలీస్ స్టేషన్ సీఐ ఆకుల మురళీకృష్ణ అన్నారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆయన రాణిగారితోట, తారకరామ నగర్ కరకట్ట ప్రాంతంలో గురువారం ఆ ప్రాంత నివాసులకు, విద్యార్థులకు డ్రగ్ అవేర్‌నెస్ క్యాంప్ నిర్వహించారు. సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ డ్రగ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ధూమపానం, మద్యం సేవించడం, హెరాయిన్, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రత కోల్పోయి మానసికంగా క్రుంగి పోతారని, ముఖ్యంగా విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై నిఘా ఉంచి డ్రగ్స్ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని సూచించారు. సమీపంలో డ్రగ్స్‌కు బానిసలైన, బానిసలవుతున్న వారు ఎవరైనా ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని, వారిని డ్రగ్స్ బారి నుంచి విముక్తులను చేసేందుకు కౌన్సెలింగ్ ఇప్పిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మాదక ద్రవ్యాలకు, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉంచాలని, చదువుపై శ్రద్ధ పెట్టి బాగా చదువుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్ప్ అండ్ విముక్తి టీమ్ సభ్యులు అపూర్వ, ఆశ, పుష్పవతి, లక్ష్మీప్రసన్న, భూమిక టీం సభ్యురాలు శ్యామల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించండి

వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఏ. మహేష్



నీటి నమూనాలను పరిశీలిస్తున్న వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ మహేష్

పటమట(విజయవాడతూర్పు): నగర వాసులకు తాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్య లేకుండా అధికారులు ప్రతి నిత్యం పర్యవేక్షించాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఏ మహేష్ ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా గురువారం ఆయన చిట్టినగర్ బూస్టర్ పంప్ హౌస్, కేఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్, 56వ డివిజన్, ఏపీ ఐఐసీ కాలనీ లో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు. చిట్టినగర్‌లోని బూస్టర్ పంప్‌ను పరిశీలించి, నీటి సరఫరా అవుతున్న కనెక్షన్లు, కొండ ప్రాంతాల్లో లీకేజీ సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన కేఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్‌లో నీటి శుద్ధిలో తీసుకుంటున్న జాగ్రత్తలు, సరఫరాలో ఎదురయ్యే సమస్యలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. 56వ డివిజన్‌లో ఇంటింటిలో నీటి నమూనాలను సేకరించి క్లోరిన్ పరీక్షలను నిర్వహించారు. నీటి సరఫరా చేసే ప్రాంతాల్లో తాగునీటి కలుషితం లేకుండా నిరంతరం పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు పటిష్టంగా పర్యవేక్షణ చేస్తూ సైడ్ డ్రెయిన్లలో తాగునీటి పైపులు కలవకుండా అసిస్టెంట్ ఇంజినీర్లు జూలై 20వ తేదీ నాటికి వాటిని గుర్తించి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అలాగే ప్రతి ఇంటి నుంచి ఏఈ, డీఈ స్థాయిలో నమూనాలను సేకరించాలని, సేకరించిన నీటి నమూనాల పరీక్షలను సీఈ ధ్రువీకరించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యిన తర్వాత డ్రెయిన్లలో తాగునీటి పైపులైన్లు కనిపిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయన ఏపీఐఐసీ కాలనీలో పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించి కాలనీల్లో పారిశుధ్య నిర్వాహణ ఎప్పటికప్పుడు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, డ్రెయిన్లలో ఎప్పటికప్పుడు సిల్టును తొలగించాలని ఆదేశించారు. కమిషనర్ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ -1 ప్రసాద్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ -1 డాక్టర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలి



ప్రాజెక్ట్స్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న నిపుణులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలని పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్ సుధీర్ చెప్పారు. ఆ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కంప్యూటర్స్ విద్యార్థులకు ఐఓటీ అంశంలో ప్రాజెక్ట్‌లపై మూడు వారాల పాటు జరిగే వర్క్‌షాప్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్‌ను ప్రారంభించిన చిట్టా అమర్ సుధీర్ మాట్లాడుతూ కంప్యూటర్స్ రంగంలో విప్లవాత్మకమైన అభివృద్ధి కొనసాగుతుందన్నారు. అనేక గొప్ప ఆవిష్కరణలు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. అందులో భాగంగా ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లో చాలా వేగవంతమైన ప్రగతి చోటు చేసుకుంటుందన్నారు. ఆ రంగంలో విద్యార్థులు మరింత పట్టు సాధించాలని చెప్పారు. ఆ దిశగా ఈ వర్క్‌షాప్ తోడ్పడుతుందన్నారు. ఎడ్యునో రోబోట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కోశాధికారి రాఘవయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.పతంజలిశాస్త్రి, విభాగాధిపతులు మహాలక్ష్మి, పి.శిల్ప, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ అక్బర్ పాల్గొన్నారు.

డయేరియాతో అప్రమత్తంగా ఉండండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రెహమతున్నీసా

భవానీపురం(విజయవాడపశ్చిమ): డయేరియా(అతిసార) వ్యాధితో అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా పేర్కొన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డయేరియా వ్యాధి నిర్మూలనకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఆమె ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెహమతున్నీసా మాట్లాడుతూ వర్షాకాలంలో సోకే డయేరియాను నివారించేందుకు తాగునీరు కలుషితం కాకుండా మున్సిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్య శాఖ అధికారులు చర్యలు చేపట్టారని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణీ, బాలింతలకు కాచి చల్లార్చిన తాగునీటిని అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వచ్చే డయేరియా వ్యాధి ప్రబలకుండా డయేరియా బారినపడినవారు దగ్గరలోని ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ శివరామప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర, ఆశా వర్కర్లు, ఏఎన్ఎమ్‌లు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సంధ్యారాణి తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తామని ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ నూతన అధ్యక్షురాలు కంతేటి సంధ్యారాణి అన్నారు. నగరంలోని విధార హోటల్‌లో గురువారం ఇన్నర్ విల్ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఉషస్సు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షురాలుగా కంతేటి సంధ్యారాణి, కార్యదర్శిగా కె.భవానీ బాధ్యతలు స్వీకరించారు. పూర్వ అధ్యక్ష కార్యదర్శులు కె.హరిత చౌదరి, జీ సరస్వతిలు నూతన అధ్యక్ష కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించారు. విజయవాడ ఇన్నర్ వీల్ మిడ్ టౌన్ క్లబ్ అధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరించటం తనకెంతో గర్వంగా ఉందని సంధ్య తెలిపారు. శ్రీకాకుళం నుంచి విజయవాడ వరకు ఇన్నర్ వీల్‌కు 37 క్లబ్ ఉన్నాయని, తాను 18వ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించానని తెలిపారు. అందరి సహకరంతో క్లబ్‌ను విజయవంతంగా నడిపిస్తామని సంధ్య ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. జిల్లా చైర్ పర్సన్ ఏ.లక్ష్మీశ్రీనివాస్, కార్యదర్శి డి.సావిత్రి, పీడీసీ యశోదా పాటిబండ్ల, మిడ్ టౌన్ సభ్యులు పాల్గొన్నారు.

వాసవీ సేవలను విస్తృతం చేయాలి



మందులను పంపిణీ చేస్తున్న వేముల హజరత్తయ్యగుప్తా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో వాసవీ సేవలను మరింత విస్తృతం చేయాలని వాసవీ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. వాసవీ క్లబ్ విజయవాడ డైమండ్ కపుల్స్ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాల వద్ద వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన వేముల హజరత్తయ్యగుప్తా మాట్లాడుతూ సమాజంలో మానవ సేవే మాధవ సేవ అన్నారు. తోటి మానవులకు సేవలందింస్తే భగవంతునికి సేవలందించినట్లేనన్నారు. ఆ స్ఫూర్తిని వాసవీ సభ్యులు తమ సేవా కార్యక్రమాల ద్వారా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. విద్యా, వైద్య రంగాలకు మరిన్ని సేవలను అందించాల్సిన అవసరముందన్నారు. వాసవీ సంస్థలు ఆ దిశగా తమ సేవలను పెంపొందించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా వైద్య సేవలను అందించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రముఖులు కోట సత్యనారాయణ, సీహెచ్ శ్యాంప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, మామిడి శ్రీనివాసరావు, డీ కృష్ణకాంత్, చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.